క్లుప్తంగా

శ్రీవారి సన్నిధిలో సామూహిక పారాయణాలు



పారాయణం చేస్తున్న శ్రీవారి భక్తులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి, గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రీవారి భక్తులు విష్ణు సహస్ర నామ పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

దుర్గాలమ్మ ఆలయంలో అన్నప్రసాద వితరణ



అన్నప్రసాదం వడ్డిస్తున్న నిర్వాహకులు

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయంలో ఇటీవల ప్రారంభమైన ప్రతి శుక్రవారం అన్న ప్రసాదం పంపిణీ కార్యక్రమంలో భాగంగా 250మంది భక్తులు, పేదలకు ప్రసాదం అందజేశారు. చంద్రంపాలేనికి చెందిన గూడెల శ్రీనివాసరావు, ఝాన్సీ దంపతుల సహాయ సహకారాలు అందించారు. దాతలతో పాటు ఆలయ కమిటీ అధ్యక్షుడు పిల్లా సూరిబాబు, ఉపాధ్యక్షుడు పిల్లా సూరిబాబు, కార్యదర్శి నాగోతి తాతారావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు నూనె, సబ్బుల పంపిణీ



కార్మికులకు నూనె, సబ్బులు అందిస్తున్న కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డులో పారిశుధ్య కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న 50 మందికి కొబ్బరినూనె, సబ్బులను కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు చేపలుప్పాడలో శుక్రవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ సెలవులు, పండగలు అనేవి లేకుండా నిత్యం ప్రజల ఆరోగ్యం కోసం శ్రమించే పారిశుధ్య కార్మికుల రుణం తీర్చుకోలేనిదన్నారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్లు పైడిరాజు, బడే అమ్మోరు, హేమ తదితరులు పాల్గొన్నారు.

నలుగురిని కాపాడిన లైఫ్‌గార్డ్స్



పర్యాటకులను రక్షించిన లైఫ్‌గార్డ్స్

దాబాగార్డెన్స్: ఆర్కే బీచ్‌లో విషాదం తప్పింది. హైదరాబాద్‌కు చెందిన ఎనిమిది మంది యువకులు బీచ్‌కు వచ్చారు. వారిలో నలుగురు సముద్రంలో మునిగిపోతూ ఉండగా జీవీఎంసీ లైఫ్ గార్డ్స్ వెంటనే స్పందించి కాపాడారు. జీవీఎంసీ ఇన్‌చార్జి స్పోర్ట్స్ డైరెక్టర్ రాజు తెలిపిన వివరాలివి. హైదరాబాద్ నుంచి వచ్చిన షబ్బీర్, అబ్బాస్, ఇద్రిస్, హుస్సేన్ శుక్రవారం ఉదయం ఆర్కే బీచ్‌లో స్నానానికి దిగారు. అలల ఉధృతికి వారు నీటిలో మునిగిపోవడం గమనించిన బీచ్ లైఫ్‌గార్డ్స్ ధనరాజు, నవీన్, ఆనంద్, లక్ష్మణరావు, కేపీ వాసు వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. అనంతరం వారికి ప్రథమ చికిత్స అందించారు. ఆ తర్వాత వారిని పోలీసులకు అప్పగించారు. పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించిన అనంతరం వారిని పంపించివేశారు.

బీఆర్ తాళ్లవలస సచివాలయం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో విజయ్ కుమార్

పద్మనాభం: మండలంలోని బీఆర్ తాళ్లవలస సచివాలయాన్ని ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. సచివాలయంలో రికార్డులు పరిశీలించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం, స్వామిత్వ సర్వేలను పరిశీలించారు. సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు.

ఎండాడలో రైతుబజారు కలేనా?



సాగర్‌నగర్‌లో రోడ్డుమీదే కూరగాయలు విక్రయిస్తున్న రైతులు



ఎండాడ రోడ్డువైపు కూరగాయల విక్రయాలు

జీవీఎంసీ జోన్–2 పరిధిలోనే పెద్ద వార్డు 8వ వార్డు. **జనాభాలో**, అభివృద్ధిలో ఎంతో వేగంగా ముందుకు వెళ్తో**ంది** ప్రాంతం. ఇక్కడ రైతుబజారు ఏర్పాటు స్థానికుల క**ల**. ప్రజాప్రతినిధులు కూడా ఎన్నేళ్లుగా చెబుతూనే ఉన్నా.. ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. దీంతో నివాసితు**లకు** వ్యయప్రయాసలు తప్పడం లేదు.

- కార్యరూపం దాల్చని బజారు ఏర్పాటు
- అందుబాటులో లేని కూరగాయలు
- వినియోగదారులకు వ్యయప్రయాసలు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డులో రైతుబజారు లేక స్థానికులు కూరగాయలు, నిత్యావసర సరకుల కోసం మధురవాడ లేక ఎంవీపీ కాలనీలోని రైతు బజార్లను ఆశ్రయించాల్సి వస్తోంది. కూరగాయల ఖర్చుకన్నా రానుపోను చార్జీలు ఎక్కువ అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అన్ని ప్రాంతాలకు అనువుగా..

దినదినాభివృద్ధి చెందుతున్న ఎండాడ వద్ద రైతు బజారు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ప్రాంతం అటు రుషికొండకు అనుకుని ఉన్న ప్రాంతాల నుంచి, ఇటు గుడ్లవానిపాలెం వరకు **సుమారు 15 ప్రాంతాలకు.. పలు కళాశాలలకు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ప్రైవేటు** వసతి గృహాలకు, హోటళ్లకు కూడా అనువుగా ఉంటుందని చెబుతున్నారు. కూరగాయలు, పప్పుదినుసులు, పండ్లు, పువ్వులు వంటి వాటితో పాటు ఇతర నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంటాయంటున్నారు.

రైతులకూ అందుబాటులో..

ఈ వార్డులో రైతు బజారు ఏర్పాటు చేస్తే పద్మనాభం, భీమిలి, ఆనందపురం, భోగాపురం తదితర ప్రాంతాల రైతులు పండించిన కూరగాయలు ఇక్క**డికి తరలించే అవకాశం ఉంది. ఈ వార్డులో వేలాది కుటుంబాలు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాయి. బయట మార్కెట్ ధరలపై నియంత్రణ లేకపోవడంతో వ్యాపారులు చెప్పిందే ధరగా ఉంది. ఈ నేపథ్యంలో రైతు బజార్లు ఏర్పాటు చేసి కూరగాయల ధరలు అదుపు చేయాల్సిన అవసరం** ఉందని స్థానికులు అంటున్నారు.

స్థల పరిశీలనకే పరిమితం

ఎండాడలో రైతు బజారు ఏర్పాటుకు ప్రభుత్వ స్థలం ఉందని స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు 4 సార్లు స్థలాన్ని పరిశీలించారు. కానీ కార్యరూపం దాల్చలేదు. ప్రజల అవసరాలను గుర్తించి పాలకులు, అధికారులు స్పందించాలని, త్వరితగతిన రైతుబజారు ఏర్పాటు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎంతో దూరం వెళ్తున్నాం



మా ప్రాంతంలో రైతుబజారు లేకపోవడంతో మధురవాడ, ఎంవీపీ ప్రాంతాల్లో గల రైతు బజారుకు వెళ్లాల్సి వస్తోంది. ఇది పేద, మధ్యతరగతి ప్రజలకు ఆర్థిక భారమే. ప్రభుత్వ పెద్దలు స్థలాలను పరిశీలించడంతో సరిపెట్టకుండా తక్షణమే రైతుబజారు ఏర్పాటు చేయాలి.

– గుడ్ల పోలిరెడ్డి, గుడ్లవానిపాలెం

అందరికీ ఉపయోగం



రైతుబజారు ఏర్పాటు చేయడం వలన స్థానికులకు తాజా కూరగాయలు, పండ్లు వంటివి దొరుకుతాయి. ధరలు కూడా అందుబాటులో ఉంటాయి. రైతులకు, వ్యాపారులకు కూడా ఉపాధి అవకాశం ఉంటుంది. అందరికీ ఉపయోగకరం.

– ఉప్పల సురేష్ కుమార్, వ్యాపారి, ఎండాడ

అధికారులు స్పందించాలి



నగరంలో రైతుబజార్లు ఏర్పాటు చేసిన అధికారులు శివారు ప్రాంతం ఎండాడలో ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకరం. దీంతో చాలా దూరం వెళ్లాల్సి వస్తోంది. స్థానికుల అవసరాలు గుర్తించి, అందరికీ అందుబాటులో ఉన్నచోట రైతు బజారు ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– చెన్నా ఎల్లయ్య, 8వ వార్డు

వర్షాలకు జారిపోతున్న గ్రావెల్



మంగళవారం నాటి వర్షానికి పక్కనే గ్రామంలోకి చేరిన గ్రావెల్



వర్షానికి పాఠశాల ముఖద్వారంపైకి జారుతున్న గ్రావెల్

- గతంలో కూలిన ఆనందపురం హైస్కూల్ ప్రహరీ
- కాలనీలోకి కొట్టుకురావడంతో కాలనీవాసుల ఆందోళన

తగరపువలస: ఆనందపురం జెడ్పీ హైస్కూల్ ఆవరణను తరచూ కురిసే వర్షాలు ఆనవాళ్లు లేకుండా చేస్తున్నాయి. గతంలో కురిసిన వర్షాలకు కాలనీ వైపు ప్రహరీ కూలిపోయింది. మంగళవారం కురిసిన వర్షానికి వాలు ప్రాంతం నుంచి బురదతో కూడిన గ్రావెల్ సమీపంలోని కాలనీలోకి కొట్టుకువచ్చింది. ఇప్పటికైనా స్పందించి, హైస్కూల్‌కు ప్రహరీ నిర్మించి క్రీడా మైదానాన్ని గ్రావెల్‌తో ఎత్తు చేయించకపోతే వచ్చే వర్షాలకు తమకు ఇబ్బందులు తప్పవని సమీప గ్రామాల ప్రజలు వాపోతున్నారు. గతంలో పాఠశాల మైదానానికి నిధులు మంజూరైనా, అవి సరిపోలేదు. అలాగే ముఖద్వారం వైపు సీసీ రోడ్డుపై కూడా వర్షాల సమయంలో గ్రావెల్ జారిపోతోంది. ప్రభుత్వం జెడ్పీహైస్కూల్‌కు రక్షణ చర్యలు చేపట్టాలని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీలు అవసరమా..?

ఏయూ హెచ్‌వోడీల సమావేశంలో ఇదే చర్చ

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీలో గెస్ట్ ఫ్యాకల్టీల అవసరం ఏ మేరకు ఉందనేది మరోమారు చర్చకు దారి తీసింది. ఏయూ క్యాంపస్ కాలేజీల ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులతో శుక్రవారం సమావేశమైన వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ వివిధ అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. అంతర్గతంగా జరిగిన సమావేశం కావడంతో వివరాలు గోప్యంగా ఉంచారు. ఈ నెల 28న రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల వైస్ చాన్సలర్లు, రిజిస్ట్రార్‌లతో నిర్వహించే సమావేశానికి సమగ్ర నివేదికలతో హాజరు కావాలని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఇక్కడి అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఏయూలో జరిగిన సమావేశానికి ప్రాధాన్యం సంతరించికుంది. వర్సిటీలోని విభాగాల వారీగా పనిచేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీలు లెక్క తీసిన వీసీ రాజశేఖర్ ఒకింత విస్మయం వ్యక్తం చేసినట్లు తెలిసింది. విభాగాల్లో ఇంతమంది అవసరమా..? అని ప్రశ్నిస్తూనే.. వారిలో బోధనా నైపుణ్యత ఎంత ఉందనేది తెలుసుకునేందుకు మరోమారు ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పని చేస్తున్న వారిలో అనుభవజ్ఞులను కొనసాగిస్తూనే.. కొత్తగా తీసుకునేందుకు ఎలా ముందుకెళ్లాలనే దానిపై అందరి అభిప్రాయాలను సేకరించినట్లు సమాచారం. ప్రస్తుతం వర్సిటీలోని అన్ని విభాగాల్లో కలిపి సుమారుగా 400 వరకు గెస్ట్ ఫ్యాకల్టీలు పనిచేస్తున్నారు. వీరిలో కొంతమందిని పద్ధతి ప్రకారం కాకుండా హెచ్‌వోడీలు తమకు నచ్చిన రీతిలో నియమించేశారనే ఫిర్యాదులు సైతం ఉన్నాయి. దీనిపై ఫోకస్ పెట్టిన ప్రస్తుత వైస్ చాన్సలర్.. విభాగాల్లో ఎంతమంది అవసరం..? ఎవరిని ఉంచాలి..? ఎవరిని తీసేయాలనే దానిపై కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయం బయటకు పొక్కడంతో కొంతమంది గెస్ట్ ఫ్యాకల్టీలు అప్పుడే లాబీయింగ్‌లను మొదలుపెట్టారు. వీసీపై ఒత్తిడి తీసుకొచ్చి.. తాము కొనసాగేలా పావులు కదుపుతున్నారు.

రైతుబజారులో అందుబాటులోకి దుకాణాలు



చిట్టివలస రైతుబజారులో దుకాణాలు

తగరపువలస: చిట్టివలసలో రైతుబజారు ప్రారంభం కావడంతో స్థానికులకు కూరగాయలు, ఆకు కూరలు అందుబాటులోకి వచ్చాయి. తొలిరోజు గురువారం నాలుగు దుకాణాలు ప్రారంభం కాగా, శుక్రవారం 10 దుకాణాలు ప్రారంభమయ్యాయి. రైతుబజారులో శుక్రవారం ధరలు ఇలా ఉన్నాయి..

కూరగాయలు కిలో	ధర రూ.				
వంకాయ	32	పచ్చి మిర్చి	28	పొటల్స్	22
దొండ	18	వెల్లుల్లి	100	కీర	34
బెండ	18	అల్లం	54	పొట్లకాయ	28
బీర	32	కాకర	32	దిలగడ దుంప	38
ఉల్లి	19	చిక్కుడు	40	కంద	64
దోస	16	క్యాబేజీ	18	కరివేపాకు	35
ఆనపకాయ ఒకటి	14	క్యారెట్	30	కాప్సికమ్	54
ఆకుకూరల కట్ట	3	ముల్లంగి	30	చేమ దుంపలు	40
బరబాటి	54	నిమ్మకాయలు	100	**పువ్వుల ధరలు**	
టమాటా	17	అరటికాయ (ఒకటి)	7	చామంతి	350
		బీట్‌రూట్	50	గులాబీ	250
		బీన్స్	94	బంతి	120

60 మందికి ఉచిత వైద్య పరీక్షలు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు జేవీ అగ్రహారంలో భీమిలి శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. భగవాన్ శ్రీ సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శంకర్ ఫౌండేషన్ హాస్పిటల్ నేతృత్వంలో జరిగిన ఈ వైద్య శిబిరంలో 60 మందికి కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ ఎం.సూరె సన్యాసిరావు, శంకర్ ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ తోలేటి శర్మ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



నాగభూషణం (ఫైల్)

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని నేరెళ్లవలస గ్రామంలో శుక్రవారం ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలివి.. నేరెళ్లవలసలో ఉంటున్న దండు నాగభూషణం (25) ఇంటర్ వరకు చదువుకున్నాడు. తండ్రి లేరు. కొంతకాలంగా అతడి మానసిక స్థితి బాగాలేదు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం టిఫిన్ కావాలని తల్లి లక్ష్మిని కోరాడు. ఆమె దగ్గరలో హోటల్‌కు వెళ్లి టిఫిన్ తీసుకువచ్చి చూడగా, ఇంటివద్దనున్న రేకుల షెడ్డు దూలానికి చీరతో ఉరి వేసుకుని చనిపోయి కనిపించాడు. తన ఆరోగ్యం బాగా లేని కారణంగా ఆత్మహత్యకు పాల్పడుతున్నానని, తన చావుకు ఎవరూ కారణం కాదని లేఖ రాశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, కేసును దర్యాప్తు చేస్తున్నారు.

చాకుతో దాడి కేసులో ముగ్గురి అరెస్ట్

తగరపువలస: ఆనందపురం మండలం లొడగలవానిపాలెం పంచాయతీ నేలతేరులో ఇంటి స్థల వివాదానికి సంబంధించి బోర సూరిబాబు అనే వ్యక్తిపై బుధవారం సాయంత్రం చాకుతో దాడికి పాల్పడిన ముగ్గురిని ఆనందపురం సీఐ వాసునాయుడు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు మారుతీనగర్‌కు చెందిన ఇంటి మణికంఠ(23) ఏ1గా, ఏలూరు చిన్నవారిపేటకు చెందిన ఇంటి లక్ష్మణరావు(44) ఏ2గా ఉన్నారు. ఆనందపురం మండలం లొడగలవానిపాలేనికి చెందిన మరో నిందితుడు జువైనల్ అని తెలిపారు.

యోగా జీవితంలో భాగం కావాలి



యోగాసనాలు వేస్తున్న ఎన్ఎస్ఆర్ఐటీ విద్యార్థులు

తగరపువలస: శారీరక దృఢత్వం, మానసిక వికాసం పెంపొందించే యోగా ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగం కావాలని ఆనందపురం మండలం కొంత్యాం ఎన్ఎస్ఆర్ఐటీ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.శంభుప్రసాద్ అన్నారు. శుక్రవారం కళాశాలలో జీఎస్టీయా–జీవీ ఇంటర్నేషనల్ యోగాడే –2025 దీక్షలో భాగంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు యోగాసనాలు వేశారు. ఫిజికల్ డైరెక్టర్ ఢిల్లీశ్వరరావు విద్యార్థులు, అధ్యాపకులతో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో సీఎంవో పీఎస్ రాజు, ఎన్ఎస్ఎస్ పీవో పి.హరగోపాల్, విద్యార్థులు, వివిధ విభాగాల అధ్యాపకులు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

తహసీల్దార్ సీల్, సంతకంతో నకిలీ పట్టాలు

గంభీరంలో ముఠా దందా



ముఠా సభ్యులు ఇచ్చిన తహసీల్దార్ సంతకం, సీల్‌తో ఉన్న పట్టా

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం పంచాయతీలో బంజరు స్థలాలను ఆక్రమించి, నకిలీ పట్టాలతో విక్రయిస్తున్న ఇద్దరు సభ్యుల ముఠా కొంతకాలంగా రెచ్చిపోతోంది. వీరి వద్ద ఆనందపురం తహసీల్దార్ సీల్, సంతకం కలిగిన సుమారు 200 వరకు నకిలీ పట్టాలు ఉన్నట్లు తెలిసింది. ఈ పట్టాలు ఖాళీగా ఉండటంతో దందాకు పాల్పడుతున్న వ్యక్తులు వీటిని నింపి 60 నుంచి 100 గజాల స్థలాలను రూ.2 లక్షల నుంచి 3 లక్షల వరకు విక్రయిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే గతంలో ప్రభుత్వం నుంచి స్థలాలు పొంది అదనంగా కొంత స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారి నుంచి కూడా బెదిరించి రూ.60 వేల నుంచి రూ.లక్ష వరకు వసూళ్లకు పాల్పడుతున్నారని పంచాయతీలో బాధితులు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో కొందరి పేర్లు చెప్పుకుని యథేచ్ఛగా సాగిస్తున్న దందా కారణంగా ఒకే స్థలాన్ని పలువురికి విక్రయించిన సందర్భాలు కూడా ఉన్నాయి. దీంతో కేవలం పట్టాలు పట్టుకుని డబ్బులు కోల్పోయిన బాధితుల సంఖ్య కూడా పెరుగుతోంది. ఈ నకిలీ పట్టాలతో వ్యాపారం చేస్తున్న వారిని రెవెన్యూ అధికారులు గుర్తించి, విచారించి చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

నీడ లేని బీచ్ పార్కు

సందర్శకుల అవస్థలు



గతంలో బీచ్ పార్కులో ఉన్న షెల్టర్‌లో సేద తీరుతున్న సందర్శకులు (ఫైల్)



ప్రస్తుతం నీడలేని బీచ్ పార్కు

భీమునిపట్నం: భీమిలి బీచ్ పార్కులో నీడ లేక సందర్శకులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడి తీరం వద్ద ఉన్న పార్కు గతంలో విశాలంగా ఉండేది. సందర్శకులు కూర్చునేందుకు అధిక సంఖ్యలో సిమెంట్ బెంచీలు, పెద్ద సిమెంట్ షెల్టర్ ఉండేవి. ఎండ లేని సమయాల్లో, సాయంత్రం వేళల్లో ఈ బెంచీలపై సందర్శకులు సరదాగా గడిపి వెళ్లేవారు. రోజూ అధిక సంఖ్యలో వచ్చి వెళ్లే సందర్శకులు సేద తీరేందుకు ఇక్కడ విశాలమైన సిమెంట్ షెల్టర్ ఉండేది. దీంతో తీరంలో గడిపిన సందర్శకులు, తర్వాత పార్కులోని షెల్టర్‌లో సేదతీరడంతో పాటు, భోజనాలు, అల్పాహారం చేసి వెళ్లేవారు. ఇది అందరికీ ఎంతో సదుపాయంగా ఉండేది. అయితే, హుద్‌హుద్ తుఫాన్ సమయంలో పార్కు సగం వరకు కోతకు గురై సముద్రంలో కలిసిపోయింది. దీంతోపాటు ఇక్కడి షెల్టర్ కూడా వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఇక్కడ నీడలేకుండా పోయింది. తర్వాత కాలంలో అధికారులు పార్కులో అభివృద్ధి పనులు చేపట్టినా, మళ్లీ కొత్త షెల్టర్‌ను ఏర్పాటు చేయలేదు. దీంతో సందర్శకులు ఎక్కువసేపు బీచ్‌వద్ద ఉండలేక వెనుతిరుగుతున్నారు. గతంలో ఉన్నట్టు కొత్త షెల్టర్‌ను ఏర్పాటు చేస్తే అందరికీ అనువుగా ఉంటుందని సందర్శకులు కోరుతున్నారు.

ఆర్ఎంపీలు అల్ట్రాసౌండ్ స్కానింగ్ రిఫర్ చేయరాదు

మహారాణిపేట: జిల్లాలోని ఆర్ఎంపీలు గర్భిణులకు అల్ట్రాసౌండ్ స్కానింగ్ రిఫర్ చేయరాదని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ పూర్ణేంద్రబాబు అన్నారు. గర్భిణులకు ఎవరైనా నాటు వైద్యం చేసినా, ఆర్ఎంపీలు వైద్యం చేసినా, అల్ట్రాసౌండ్ స్కానింగ్‌కు రిఫర్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా వైద్యుల సలహా మేరకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం పొందడం వల్ల మాతా, శిశు మరణాలను నియంత్రించవచ్చని అన్నారు.

రిజిస్ట్రేషన్ తప్పనిసరి.. : విశాఖ నగరం, గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఆస్పత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్, స్కానింగ్ కేంద్రాలు, ఫెర్టిలిటీ కేంద్రాలు తప్పనిసరిగా క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్–2002 ప్రకారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం (ఆన్‌లైన్)లో రిజిస్టర్ చేసుకోవాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో తెలిపారు. రిజిస్ట్రేషన్ లేకపోతే అటువంటి కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్ యాజమాన్యాలు http// clicalesttact.ap.gov.in ద్వారా, స్కానింగ్ కేంద్రాల యాజమాన్యాలు https//pcpndt.ap.gov.in ద్వారా రిజిస్టర్ చేసుకోవలసిందిగా తెలిపారు.

ఎస్సీ కాలనీలో డ్రైనేజీలు అధ్వానం



అంబేడ్కర్ కూడలి వద్ద శిథిలమైన డ్రైనేజీ పలకలు



12వ వార్డులో డ్రైనేజీపై దుస్థితి



వర్షం పడితే డ్రైనేజీ నీరు వీధుల్లోకే..

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీ ఎస్సీ కాలనీలో డ్రైనేజీలు అధ్వానంగా ఉన్నాయి. పలుచోట్ల డ్రైనేజీలపై పలకలు శిథిలం కావడంతో, స్థానికులు అందులో పడి తరచూ గాయాలపాలవుతున్నారు. ముఖ్యంగా అంబేడ్కర్ కూడలిలోని ఆయన విగ్రహం ముందు సర్వీస్‌రోడ్డును ఆనుకుని డ్రైనేజీపై పలకలు ధ్వంసం అయ్యాయి. అలాగే కాలనీలోని 12వ వార్డులో ఇప్పటికే సరైన రహదారులు లేవు. దీంతో పాటు ఉన్న డ్రైనేజీలు కూడా శిథిలం కావడంతో వర్షాలకు ఇబ్బందులతో పాటు స్థానికులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి శిథిలమైన డ్రైనేజీలకు మరమ్మతులు చేయించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

56 మందికి రక్తపరీక్షలు



రక్త పరీక్షలకు హాజరైన సంగివలస వాసులు

తగరపువలస: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీమ్, మొబైల్ ఐసీటీసీ సంయుక్తంగా శుక్రవారం జీవీఎంసీ పరిధిలోని సంగివలస, చిట్టివలసలో హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించారు. మొబైల్ ఐసీటీసీ కౌన్సెలర్ అర్జున్ హెచ్ఐవీపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా గర్భిణులు రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 56 మందికి రక్తపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ కిషోర్‌కుమార్, లింక్ వర్కర్ జ్యోతి, ఆరోగ్య సిబ్బంది ఆదిలక్ష్మి, అంగన్వాడీ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.